
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం 16 సెప్టెంబరు 2025



భద్రాద్రి వద్ద పెరుగుతున్న
గోదావరి


భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 34.9 అడుగులున్న గోదావరి.. సోమవారం ఉదయం 6 గంటలకు 37.5 అడుగులకు చేరింది. 9 గంటలకు 38.2 అడుగులకు, 12 గంటలకు 38.8, మధ్యాహ్నం మూడు గంటలకు 39.3, సాయంత్రం 6 గంటలకు 39.7, రాత్రి 8గంటలకు 39.8అడుగులకు చేరుకుంది. గోదావరి నీటిమట్టం మరికొద్దిగా పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అనంతరం నీటిమట్టం నిలకడగా ఉండి తగ్గుముఖం పడుతుందని, తీర ప్రాంతం వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రారా నా వెన్నముద్ద
గోపాలా

- భద్రాద్రి రామాలయంలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు
- స్వామి వారికి ఊంజల్ సేవ
- శ్రీ కృష్ణుడికి పంచామృతాభిషేకం
- తొమ్మిది ప్రత్యేక ప్రసాదాలతో నివేదన

6



రామాలయంలో స్వామివారు, ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఇంటి బాధ్యతలు చక్కబెట్టడమే పరమావధిగా పనిచేస్తుంటారు మహిళలు. ఉదయం నిద్రలేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రకు ఉపక్రమించే వరకు వారు శ్రమిస్తూనే ఉంటారు. కుటుంబం ఆలనాపాలనపై దృష్టి పెట్టే క్రమంలో తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపరు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు తాత్కాలికంగా మందులు వేసుకొని సరిపెట్టుకుంటారు. కానీ.. ఈ క్రమంలో వారికి సోకుతున్న దీర్ఘకాలిక వ్యాధుల గురించి పట్టించుకోరు. ఫలితంగా అవి ముదిరి వారి ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రారంభించి పరీక్షలు నిర్వహిస్తూ చికిత్సలు అందిస్తోంది. మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం రేపటి నుంచి అక్టోబరు రెండు వరకు పదిహేను రోజుల పాటు 'స్వస్థ్‌నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఈ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలుచేస్తోంది.


ఆరోగ్యమహిళ కార్యక్రమంలో పరీక్షల కోసం ఖమ్మం ఆస్పత్రికి వచ్చిన మహిళలు (ఫైల్)

అతివకు ఆరోగ్యం!

- రేపటి నుంచి స్వస్త్‌నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం
- వచ్చేనెల 2 వరకు కార్యక్రమం

ఖమ్మం జిల్లాలో 'ఆరోగ్య మహిళ', ఎన్సీడీ కార్యక్రమాల్లో బయటపడిన వ్యాధులిలా..

13-15 ఏళ్ల వయసు బాలికల్లో రక్తహీనత	283
రక్తపోటు	20,354
మధుమేహం	8,313
గర్భిణుల్లో రక్తహీనత	722
బ్రెస్ట్ క్యాన్సర్	87
సర్వైకల్ క్యాన్సర్	63
ఓరల్ క్యాన్సర్	2
ఇతర క్యాన్సర్లు	58
క్యాన్సర్‌తో మృతి చెందిన మహిళలు	36

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో 26 పీహెచ్‌సీలు, 4 యూపీహెచ్‌సీలున్నాయి. వీటి పరిధిలో రోజుకు 10 క్యాంపుల చొప్పున 12 రోజుల్లో 120 క్యాంపులను నిర్వహించి మహిళలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నారు. స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్, ఫాలో అప్ పేరుతో మహిళలకు పరీక్షలు నిర్వహించడం, వాటికి చికిత్సలు చేయడం. ఇప్పటికే చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి చికిత్సలు తీసుకుంటున్నారని ఈ కార్యక్రమంలో పరీక్షించనున్నారు. మొత్తంగా జనరల్ మెడిసిన్, సర్జరీ, డెర్మటాలజీ, 11 ఏళ్ల నుంచి యుక్త వయసు ఆడపిల్లలకు,

(మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి జిల్లాలో..

మహిళలు ఆరోగ్య వంతులుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 8న ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రారంభించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు భద్రాద్రి జిల్లాలో ప్రతీరోజు 597 మంది ఓపి ఉండగా ఇప్పటివరకు మొత్తం 77,857 ఓపీలు నమోదయ్యాయి. వీటిలో ఓరల్ క్యాన్సర్ -187, బ్రెస్ట్ క్యాన్సర్ - 316, సర్వైకల్ క్యాన్సర్ - 554, రక్తహీనత - 57,129, బరువు తగ్గిన రోగులు - 6,871, లైంగిక సమస్యలు -248, న్యూరో సమస్యలు - 18,632, మూత్ర సంబంధ సమస్యలు -3,723, మెనోపాజ్ -30,213, గర్భాశయ సమస్యలు -6,104 మంది మహిళలున్నారు. ఇప్పటివరకు మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు 1,539 మందిని రిఫర్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో ఆరోగ్య మహిళ పథకంలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగ్గా అందజేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి ఆంధ్రజ్యోతికి సోమవారం తెలిపారు. ఈ క్రమంలోనే స్వస్త్‌నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్ మొత్తం జిల్లాలో పీహెచ్‌సీలు -29, యూపీహెచ్‌సీలు - 5, జీజీహెచ్ -1, పల్లె దవాఖానాలు - 5, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు - 153, ప్రైవేట్ ఆసుపత్రిలో -11 కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

దరఖాస్తులు స్వీకరించి..
అధికారులను ఆదేశించి..

- ప్రజావాణి దృష్టికొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలని, మన పరిధిలో ఉన్న వాటికి సంబంధించి పనిని వెంటనే పూర్తి చేయాలని, మనం చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనల వివరాలను తెలుపుతూ లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు. వార్తా పత్రికల్లో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలపై క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల వివరాలు అందించాలని, దీనిపై డీపీఆర్వో సమీక్ష చేయాలన్నారు. ఈఈ హౌసింగ్, డీఆర్డీవో, డీపీవో, డీఎంహెచ్‌వో వివిధ శాఖల వద్ద పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రిపోర్ట్ పెండింగ్ ఉందని, వీటిని సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, జిల్లా అధికారులు డీపీవో ఆశాలత, జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ముస్లిం మైనార్టీ సంక్షేమాధికారి ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

వేంసూరు మండలం రాయుడుపాలెం పంచాయతీ దూళ్ల కొత్తూరుకు చెందిన యర్రా వీరయ్య తనకు అమ్మపాలెం గ్రామరెవెన్యూలో సర్వే నెంబర్ 323/అలో 4 కుంటలు, సర్వేనెంబర్ 202ఇలో రెండెకరాల 15కుంటలు, సర్వేనెంబర్ 203లో ఎకరం 15కుంటలు మొత్తం 7ఎకరాల 30కుంటల భూమి ఉంది. కాళ్లూరి జోగారావు, రావూరి అచ్చయ్య నుంచి కొనుగోలు చేసుకుని సుమారు 65ఏళ్లుగా మా సాగులో ఉన్న భూమిని తహసీల్దారు వేరేవారి పేర్ల తో పాసుపుస్తకాలు జారీ చేశారని విచారించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

- వేంసూరు మండలం కందుకూరు గ్రామ రైతులు తాము వరుణ్ అగ్రిటెక్ కంపెనీకి చెందిన బీపీటీ 2782 వరి విత్తనాలు కొనుగోలు చేసి వరి సాగు చేశామని, ఎకరానికి 25 వేల చొప్పున ఖర్చయిందని, కల్తీవిత్తనాలు విక్రయించిన వరుణ్ అగ్రిటెక్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్, కాంటింజెంట్, పార్ట్ టైం వర్కర్స్ యూనియన్ జేఏసీ తరఫున తమకు పాత పద్ధతిలో కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.
- రెబ్బవరం బస్టాండ్‌ను ఆక్రమించారని, ఈ ఆక్రమణలు తొలగించి బస్టాండ్ పునరుద్ధరించాలని రెబ్బవరం, కొండకొడిమ, ఖానాపురం, గన్నవరం గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

భూ రక్షణ కవచం.. ఓజోన్

- పర్యావరణ మార్పులతో పొరకు తూట్లు
- మానవ తప్పిదాలతో ముప్పు ముంచుకొచ్చే అవకాశం
- పరిరక్షణపై ప్రజల్లో కొరవడుతున్న అవగాహన

7


ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉపకార వేతనాల కోసం
పోరుబాట

- పెండింగ్ ఫీ రీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన వామపక్ష విద్యార్థి సంఘాలు
- 3వేల మంది విద్యార్థులతో ఖమ్మంలో మహాప్రదర్శన

6

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- రాష్ట్రంలోని సొసైటీల నిర్వహణ తీరు భేష్
- రైతులు, చేనేత, హౌసింగ్ సొసైటీల మనుగడే ప్రాథమిక ధ్యేయం
- 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర సహకార శాఖ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 908 సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని, రాష్ట్రంలోని సొసైటీల నిర్వహణ తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర సహకార శాఖ అదనపు కమిషనర్ గురజాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పర్యటనకు వచ్చిన ఆయన ఖమ్మంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతు, చేనేతకు సంబంధించిన సంఘాలకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రాథమిక సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) నిర్వహణ, వాటి పనితీరు, ఎన్నికల నిర్వహణ, నియంత్రణ తదితర అంశాలను 1964 సహకార చట్ట ప్రకారం నిర్వహించడంతో పాటు సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా త్రీ టైర్ క్రెడిట్ స్ట్రక్చర్ ద్వారా కేంద్రంలోని నాబార్డు నుంచి జిల్లాల కో-ఆపరేటివ్ బ్యాంకులకు, అక్కడి నుంచి పీఏసీఎస్‌లకు, ప్యాక్స్ సెంటర్ల నుంచి రైతులకు, సహకార సంఘాలకు రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 76 సహకార సంఘాల నిర్వహణా పరంగా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సహకార సంఘాలే కాకుండా ఇటీవల పాల్వంచ, మణుగూరు, అశ్వాపురంలో కేటీపీఎస్ ఎన్నికలను సైతం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహణ, విజయవంతం చేయడంలో ఖమ్మం జిల్లా సహకార అధికారుల పాత్ర అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఖమ్మం జిల్లా సహకార సంఘ అధికారి గంగాధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో సహకార సంఘ సిబ్బంది అవనిశ్రీ, సందీప్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సన్మానిస్తున్న సహకార శాఖ ఉద్యోగులు

ఇందిరా డెయిరీలో..
మొదటి అడుగు..

- తొలివిడత గేదెల పంపిణీకి రంగం సిద్ధం
- మధిర నియోజకవర్గంలో 125మంది కోసం 250 గేదెల కొనుగోలు
- ఇప్పటికే వాటాదారులుగా 21వేల మంది డ్వాక్రా మహిళలు
- అతివల ఆర్థిక పురోగతికి బాటలు వేసిన డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక పురోగతికి బాటలు వేసేలా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన కలల ప్రాజెక్టుగా రూపొందించిన ఇందిరా డెయిరీ ఏర్పాటులో మొదటి అడుగు పడుతోంది.దీనికి సంబంధించిన పనులు నియోజకవర్గంలో చకచకా జరుగుతున్నాయి. బోనకల్ మండల కేంద్రంలో రూ.కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ డెయిరీ పనుల్లో భాగంగా అధికారులు గ్రామాలకు పరుగులు తీస్తున్నారు.డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశాలను నిర్వహిస్తూ సభ్యత్వాలు చేర్పిస్తున్నారు. పాల ఉత్పత్తులతో పాటు సేకరణకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో గేదెల కొనుగోళ్లకు గానూ అధికారులు పొరుగు రాష్ట్రానికి వెళ్లారు. అక్కడ నుంచి బోనకల్ గ్రామానికి సోమవారం ఆ గేదెలను తీసుకొచ్చారు. వాటిని పశు సంవర్ధక శాఖ జేడీ బోడేపుడి పురందర్, ఐకేపీ ఏపీఎంలు లక్ష్మణరావు, కొట్టె వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఐకేపీ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి విజయభాస్కరరెడ్డి, ఎంపీడీవో ఆర్. రమాదేవీలు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


బోనకల్‌లో గేదెలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ పురంధర్

మొదటి విడత గేదెల పంపిణీకి రంగం సిద్ధం

ఈ ఇందిరా డెయిరీ కింద నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొదటి విడతలో 125 మందికి 250 గేదెలను పంపిణీ చేసేందుకు గానూ అధికారులు ఆంధ్రా రాష్ట్రానికి వెళ్లారు. ఒక్కొక్క మండలంలో 25మంది లబ్ధిదారులకు, ఒక్కొక్కరికి రెండు చొప్పున 50 గేదేల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. ఒక్కో గేదె విలువ రూ.2లక్షలు ఉండగా, ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.1.40లక్షలు మినహాయించి, లబ్ధిదారులు రూ.40వేలు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బును బ్యాంకు ద్వారా రుణమిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 61,500 డ్వాక్రా మహిళలున్నారు. ఇప్పటికే ఒక్కొక్కరు రూ.2,100 వాటాధనం చెల్లించి, 20వేల మంది భాగస్వాములుగా ఉన్నారు. మిగిలిన మహిళలు కూడా వాటాధనం చెల్లించి భాగస్వాములుగా మారేందుకు సిద్ధంగా ఉన్నారు. బోనకల్ మండలంలో మొదటి విడతలో ముష్టికుంట్ల, బోనకల్, తూటికుంట్ల, రాయనపేట, చిరునోముల గ్రామాల్లో 25మందికి గేదెలను ఇవ్వనున్నారు. బోనకల్, ముదిగొండ గ్రామాల్లో 5వేల లీటర్ల సామర్థ్యం గల బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎమ్‌సీయూ)లను పాలసేకరణకు సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గంలో విడతలవారీగా 132గ్రామాల్లో పాలసేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే ఎర్రుపాలెం మండలంలో పాలు సేకరిస్తున్నారు. మిగిలిన మండలాల్లో కూడా పాల సేకరణకు అన్ని ఏర్పాట్లు చేసే పనుల్లో అధికారులు బిజీబిజీగా ఉన్నారు. లీటరుపాలకు రూ.80 నుంచి రూ.85 వరకు ధర చెల్లించనుండటంతో మహిళల ఆర్థిక ప్రగతికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బాటలు వేసినట్టు అయిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విలువల విద్య

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలు పాఠశాలల్లో నైతిక విలువలు, విద్యార్థులు పాటించాల్సిన విధానంపై బోధిస్తుండగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని, వారిలో అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి టీ-సాట్ విద్యా ఛానెల్‌లో కార్యక్రమం ప్రసారానికి చర్యలు చేపట్టింది. సోమవారం విలువల విద్య కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలోని 866 ప్రైమరీ, 277 అప్పర్ ప్రైమరీ, 458 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీకి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, ఉన్నత పాఠశాలలకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:30 గంటల వరకు నిర్వహించారు.

కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలివే..

పాఠశాలల్లో పిల్లలకు వ్యక్తిగత, సామాజిక బాధ్యతను గుర్తు చేయడం, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుత విలువలను కేవలం పాఠ్యాంశాలకు పరిమితం చేయకుండా చదువుతున్న అన్ని సబ్జెక్టులతో సమన్వయం చేస్తూ సామర్థ్యాలను మెరుగుపర్చడంపై దృష్టి సారించనున్నారు. విజ్ఞాన శాస్త్రం వంటి సబ్జెక్టులను బోధించే సమయంలో కూడా విలువల విద్య ప్రాముఖ్యతను అనుసంధానం చేయాలనేదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం విలువల విద్య, జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠ్య ప్రణాళికలు రూపొందించారు. పాఠశాల స్థాయిలో 18 రకాల ప్రధాన విలువలపై అవగాహన కల్పించనున్నారు. ప్రతీ తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా కరదీపికలను తయారు చేశారు.

ఎథిక్స్‌పై అవగాహన
టీ-సాట్లో ప్రసారం ప్రారంభం


ఎస్ఎస్‌సీ పాఠశాలలో టీ-సాట్‌లో పాఠాలు వింటున్న విద్యార్థులు

ఓపీ..
1,835

- ఇదీ సోమవారం జిల్లా ఆస్పత్రికి వచ్చిన రోగుల సంఖ్య
- వారం రోజులుగా ఇదే పరిస్థితి..
- జ్వరబాధితులే అధికం

7


ఓపీ కోసం క్యూ

ఉపకార వేతనాల కోసం పోరుబాటు

» పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన వామపక్ష విద్యార్థి సంఘాలు

» 3వేల మంది విద్యార్థులతో ఖమ్మంలో మహాప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ వివక్షకు గురవుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ ఆరోపించారు. విద్యారంగానికి కావాల్సిన మేరకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్,పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో మహా ప్రదర్శన చేశారు. సుమారు 3వేల మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు వెంటనే మంజూరు చేయాలని విద్యార్థులు ప్లేకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీ, ఇల్లెందు క్రాస్ రోడ్డులో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు అందాల్సిన వారిలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలోని నిరుపేదలైన కుటుంబాల విద్యార్థులే అధికంగా ఉన్నారని వాపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వరకు ఫీజు రియింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు మంజూరు చేయకపోవటంతో ఇంజనీరింగ్, వైద్య, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ధ్రువపత్రాలు పొందలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు బోధనా రుసుము(ఫీజు రియింబర్స్‌మెంట్), ఉపకార వేతనాలు ఇవ్వటం లేదని, రూ. 8,150 కోట్లు బకాయిలు పెరిగాయని వారు ఆరోపించారు. రాష్ట్రం ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తుడుం ప్రవీణ్, మస్తాన్, మందా సురేశ్, మడుపల్లి లక్ష్మణ్, సుధాకర్, తిప్పారపు లక్ష్మణ్, శ్యామల, లోకేష్, వినయ్, సురేశ్, అన్వేష్, నాగులు, మీరా, శివ, వంశి, మనోజ్, గోపి, సాయి, వెంకటేష్, త్రీనాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకుండా మోసగిస్తున్న ప్రభుత్వం

జూలూరుపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయినప్పటికీ వాటిని నెరవేర్చకుండా మోసగిస్తుందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరిరమేష్ గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విమోచన, ప్రధానమంత్రి నరేంద్రమోది పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వరకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతులకు యూరియా కొరతను తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. అనంతరం ఆయన మండలంలోని బోజ్యాతండా గ్రామాన్ని సందర్శించారు. మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఇటీవల జర్నలిస్టు దుద్దుకూరి రామారావు తండ్రి గోపయ్య మృతి చెందటంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. పాపకొల్లులో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రోకటి సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, సుబ్బారావు, సాయి, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, రామారావు, రాంబాబు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బీసీ విద్యార్థుల.. విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

» ఈ నెల 24 వరకు గడువు



ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు విదేశాలు వెళ్లి చదువుకోవాలనే ఆసక్తి గల వారు ఈ నెల 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన అభివృద్ధి అధికారి జి. జ్యోతి సోమవారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు అత్యున్నత స్థాయి విద్యా అవకాశాలను అందించాలని ఆశిస్తారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను విదేశాల్లో పాఠశాలకు పంపాలని నిర్ణయించుకుంటారు, తద్వారా వారు భిన్నమైన సంస్కృతిని అనుభవించవచ్చు. చాలా మంది యువతి, యువకులు విదేశాలలో చదువుకోవాలని కలలు కంటారు, కానీ అది ఖరీదైన ప్రయత్నం. విదేశీ విద్య భారతదేశంలో కంటే చాలా ఖరీదైనది, ప్రతి ఒక్కరూ దానిని భరించలేరు. అందువల్ల, తక్కువ-ఆదాయ కుటుంబాల విద్యార్థులు తమ అం తర్జాతీయ అధ్యయనాల కోసం చెల్లించాల్సిన రుణాల మొత్తాన్ని తగ్గించడంలో సహాయపడే స్కాలర్‌షిప్‌ను పొం దేందుకు ప్రయత్నిస్తారు. మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి తెలంగాణ ప్రభుత్వం అందించిన పథకాలలో ఒకటి. విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలని ఆసక్తి ఉండి, ఆర్థికంగా వెనకబడిన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు విదేశీ విద్యానిధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. రూ.20లక్షల రుణాన్ని రెండు విడతల్లో అందించి వారి అభివృద్ధికి తోడ్పాటునిస్తోంది. బీసీలకు మహా త్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకాలు భరోసానిస్తున్నాయి. 2018నుంచి బీసీలకు ఈ పథకాలు అమలు చేస్తున్నారు

పది దేశాల్లోనే పథకం అమలు..

ఈ పథకం ద్వారా చదివేందుకు భారతదేశం నుంచి పది దేశాలకే అనుమతిస్తున్నారు. ఇందులో దక్షిణ కొరియా, అమెరి కా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశాల్లో మాత్రమే ఉన్నత విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ఇక్కడ వైద్య ,విద్య, ఇంజినీరింగ్, మేనేజ్మెంట్, ప్యూర్‌సైన్స్, వ్యవసాయం, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, తదితర కోర్సుల్లో పీజీ చేయడానికి అవకాశం ఉంటుంది.

అర్హతలు ఇలా...

- ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- ఈ కోర్సుల్లో 60శాతానికి పైగా మార్కులు సాధించాలి.
- టోఫెల్‌లో 60శాతం. ఐఈఎల్టీటీఎస్ 80మార్కులు, జీఆర్ఈ, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి పీఈటీలో 50శాతం అర్హత మార్కులు ఉన్నవారికి అవకాశం.
- విద్యార్థుల వయసు 35 ఏళ్లలోపు, తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలి.

మీసేవా కేంద్రంలో గానీ, ఆన్‌లైన్‌లో తెలంగాణ ఈపాస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.10 విలువైన నాన్ జ్యూడిషియల్ స్టాంపును అతికించి రిజిస్ట్రార్ సంతకంతో కూడి న పత్రాన్ని ఆదాయ ధ్రువ పత్రానికి జత చేసి దరఖాస్తు సమర్పించాలి. ఆయా సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శుల నేతత్వంలోని కమిటీ సభ్యులు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. మీరు మహాత్మా జ్యోతి బాపూలే ఓవర్సీస్ విద్యా నిధి కోసం సెప్టెంబరు 24లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత సాధించిన విద్యార్థులకు అత్యధిక స్కాలర్‌షిప్ రూ.20 లక్షలు. స్కాలర్‌షిప్ యొక్క మొత్తం విలువ విశ్వవిద్యాలయంలో హాజరు ఖర్చు, హోస్ట్ దేశంలో జీవన వ్యయం ప్రోగ్రామ్ విద్య యొక్క డిగ్రీ ఆధారంగా లెక్కించబడుతుంది. స్కాలర్‌షిప్ డబ్బును రెండు విభాగాలుగా విభజించి విశ్వవిద్యాలయానికి జమ చేస్తారు. ఒక అభ్యర్థిని సంస్థ ఆమోదించిన తర్వాత, మొదటి రూ.10 లక్షలు జమ చేయబడుతుంది . మొదటి సెమిస్టర్ ఫలితాలు నిర్ధారించబడిన తర్వాత రెండవ దఫా రూ.10 లక్షలు జమ చేయబడుతుంది. స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేయడానికి ముందు, వ్యక్తి తప్పనిసరిగా ప్రసిద్ధ విదేశీ విశ్వవిద్యాలయంలోకి అంగీకరించబడాలి.

రారా నా వెన్న ముద్ద గోపాలా..

» భద్రాద్రి రామాలయంలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

» స్వామి వారికి ఊంజల్ సేవ » శ్రీ కృష్ణుడికి పంచామృతాభిషేకం


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆద్యంతం సంప్రదాయబద్ధంగా సాగాయి. తొలుత దర్బారు సేవను నిర్వహించి తరువాత ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ సమయంలో భాగవతంలోని శ్రీ కృష్ణ జనన ఘట్టాన్ని ఆలయ పండితులు వివరించారు. అ నంతరం శ్రీ కృష్ణునికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి లాలలు, జోలలు నిర్వహించారు. ఈ సమయంలో తొలుత సతులార ఓ సతులార, సతులార చూడరే శ్రావణ బహుళాష్టమి, రారా నా వెన్న ముద్ద గోపాలా, ముద్దగారే యశోద ముంగిట ముత్యం వీడు, కృష్ణం కలయ సఖి సుందరం తదితర కీర్తనలను దేవస్థానం హరిదాసులు గానం చేశారు. ఈ క్రమంలో కాయం, వెన్న, పాలుతో పాటు తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను స్వామి వారికి నివేదన చేశారు. చివరగా భక్తులకు తీర్థ ప్రసాదగోష్టిని నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఉట్ల పండుగను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె దామోదరరావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రాయితీ పై భారత్ గౌరవ్ టూరిస్టు రైలు యాత్ర

» ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్

మధిర, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ దేవాలయాలు, యాత్రా ప్రదేశాలను చూసేందుకు భారత రైల్వే, ఐఆర్‌సీటీసీ కలిపి రాయితీపై భారత్ గౌరవ్ టూరిస్టు రైలు యాత్ర పేరుతో రైలు ప్రయాణాన్ని కల్పిస్తుందని ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్ అన్నారు. సోమవారం మధిర రైల్వే స్టేషన్‌లో యాత్ర వివరాలను ఆయన వెల్లడించారు. దేశంతో పాటు ఇతర దేశాలలో టూరిస్టు ప్రదేశాలు చూసేందుకు ఐఆర్‌సీటీసీ రైలు, విమాన ప్రయాణంతో పాటు వసతి సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి దక్షిణాదిలోని అరుణాచలం, మధురై, రామేశ్వరం, కన్యాకుమారి, తిరుచ్చితో పాటు త్రివేండ్రం తదితర యాత్రా ప్రదేశాలు, దేవాలయాలు చూసేందుకు భారత్ గౌరవ రైలు బయలు దేరుతుందని అన్నారు. ఈ రైలు ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మంలో, సాయంత్రం 5 గంటలకు మధిర రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని తెలిపారు. వివరాలకు తమ టూర్ మేనేజర్ల నెంబర్లకు 7670500512, 9701360701, 9281030726 సంప్రదించాలని కోరారు. ఐఆర్‌సీటీసీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ సుధీర్‌బాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులిచ్చిన వారి వేధింపులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


ప్రశాంత్(ఫైల్)

తల్లాడ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని వేధించడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నరసింహారావుపేట గ్రామానికి చెందిన పిన్ని ప్రశాంత్ (27)హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాదుకు చెందిన మల్లిఖార్జున్, సుధీర్‌కుమార్, రంజిత్‌కుమార్‌ల వద్ద నుంచి ప్రశాంత్ రూ.26లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తాము ఇచ్చిన అప్పు చెల్లించాలని ప్రశాంత్‌ను ముగ్గురు వేధించడంతో హైదరాబాద్ నుంచి స్వస్థలమైన నరసంహారావుపేట వచ్చాడు. ఈనెల 13వతేదీ రాత్రి ప్రశాంత్ ఇంటివద్ద క్రిమిసంహాకర ముందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి పిన్ని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ తెలిపారు.

మాజీ జడ్పీటీసీ దంపతుల కుమారుడికి నామకరణం చేసిన కేటీఆర్


లావణ్య, రాంబాబు దంపతులు, చిన్నారితో మాజీ మంత్రి కేటీఆర్, ఇతర నాయకులు

అశ్వారావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మాజీ జడ్పీటీసీ లావణ్య, రాంబాబు దంపతుల కుమారుడికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కల్వకుంట్ల తారకరామారా వు సోమవారం నామకరణం చేశారు. తమ కుమారుడికి పేరు పెట్టాలని కోరుతూ ఆ దంపతులు తమ చిన్నారిని మాజీమంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి.. 'సు' అనే అక్షరంతో పేరుపెట్టాలని కోరగా చిన్నారికి సూర్యాంశ్ అని నామకరణం చేశారు. అనంతరం చిన్నారిని దీవించిన కేటీఆర్.. ఆ దంపతులకు కేసీఆర్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా లావణ్య, రాంబాబు మాట్లాడుతూ పార్టీపై ఉన్న అభిమానంతో కేటీఆర్‌ను కుటుంబపెద్దగా భావించి ఆయన చేతుల మీదుగా నామకరణం చేయించామని తెలిపారు. ఇది సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో పాటు పలువురు నాయకులున్నారు.

వసూళ్ల దందాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చింతకాని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్నేటి లంకలో గేటు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులపై చింతకాని, ముదిగొండ ఎంఆర్‌పీఎస్ నాయకులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికు ఫిర్యాదు చేశారు. ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ పరిధిలో మున్నేటి మధ్యలో ఉన్న లంకలో తమ భూములు ఉన్నాయని పేర్కొంటూ తమ భూముల గుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ల వద్ద నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఆ భూముల్లో ఉన్న ఇసుకను మైనింగ్, రెవెన్యూ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అక్రమంగ డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.51 వేలు స్వాధీనం ● ఏడుగురిపై కేసు

కల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని తూర్పు లోకవరం గ్రామంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటనలో ఏడుగురిని అదుపులోకి తీసుకోవటమే కాకుండా, రూ.51 వేల నగదుతో పాటుగా 4 బైక్‌లను స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ డి.హరిత విలేకరులకు తెలిపారు. తూర్పు లోవకరం గ్రామ శివారున సదురు వ్యక్తులు నగదుతో పేకాట ఆడుతుండగా సమాచారం అందటంతో స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకోవటం జరిగిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు పల్టీ : నలుగురికి గాయాలు

ముదిగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై కారు పల్టీకొట్టడంతో నలుగురికి గాయాలైన సంఘటన సోమవారం ముదిగొండ మండలం వెంకటాపురం వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనలో బాలకృష్ణ, నాగమ్మ, నరేందర్, శేఖర్‌లు కారులో ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తుండగా వెంకటాపురం సమీపంలో కారు టైర్ పంక్చర్ కావడంతో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ నలుగురికి స్వల్పగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది.

హైవే నిర్మాణ పనులను అడ్డుకోవద్దు

● గ్రీన్‌ఫీల్డ్ హైవే

భూసేకరణ సమస్యలపై రైతులతో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించిన రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌లతో కలిసి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణ సమస్యలపై వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండల రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి రైతుల సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్డు డిమాండ్ ను జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని, హైవే వద్ద ఉన్న డ్రెయిన్స్ సామర్థ్యం పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.భూ సేకరణ సంబంధించి ధర తన పరిధి మేరకు ఆర్బిట్రేషన్ లో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు అన్యాయం చేయాలని ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, జాతీయ రహదారి వలన రైతుల భూముల విలువ పెరుగుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను ధర్నాలతో అడ్డుకోవద్దని కలెక్టర్ కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా నిబంధనల మేరకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పక్కన ఎమ్మెల్యే రాగమయి

● సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 40 కిలోమీటర్లు. కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవే కు తప్పనిసరిగా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు ఉండాలని, లేకుంటే రైతులు ఇబ్బంలు పడాల్సి వస్తుందన్నారు. వరదల సమయంలో నీరు పొలాలకు వెళ్లడం వల్ల ఆర్థికంగా రైతులు నష్టపోతారని, తగిన న్యాయం చేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో రైతులకు వ్యవసాయం చేయడం సాధ్యం కాదని, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామన్నారు. హైవే నిర్మాణ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నేషనల్ హై వే పీడీ. దివ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రక్రియ

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ● హాజరైన భద్రాద్రి, ఖమ్మం కలెక్టర్లు, అధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్/ ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2026 పకడ్బందీగా చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శనరెడ్డి సూచించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల్లో కలెక్టర్లు, ఈఆర్ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని జిల్లాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితాను 2025 జబితాతో సరిపోల్చుకోవాలని సూపర్‌వైజర్, బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా ఉన్న రెవెన్యూ గ్రామాల వివరాలతో సమన్వయం చేయాలని సూచించారు. మ్యాపింగ్ పకడ్బందీగా శుక్రవారం లోపు చేయాలని తహశీల్దార్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపరిటెండెంట్ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రివిజన్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై జిల్లా కలెక్టర్లతో, రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ 2002 ఎస్ఐఆర్ తరువాత ఓటు హక్కు సంక్రమించిన ప్రతి ఒక్కరి వివరాలు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ రాజు, కలెక్టరేట్ ఎన్నికల డీటీఅన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య


స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా భక్తులకు ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఇదిలా ఉండగా భద్రాచలం ఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈవో కె.దామోదరరావు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాష్ట్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ ఉన్నారు.

అతివకు ఆరోగ్యం!

(5వ పేజీ తరువాయి)

సైకియాటిస్ట్, గైనిక్, పిడియాట్రిక్, విభాగాల్లో ఆయా నిపుణులు ఈ క్యాంపుల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.

మహిళలకు నిర్వహించే చికిత్సలు ఇవే..

- బీపీ, షుగర్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు స్క్రీనింగ్
- రక్తహీనతకు గురి కాకుండా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.
- అనుమానిత మహిళలకు క్షయ నిర్ధారణ పరీక్షలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేసి నిర్ధారణైన

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

డాక్టర్ చందూనాయక్, ప్రోగ్రాం ఇన్‌చార్జ్



కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాల ప్రకారం రేపటి నుంచి అక్టోబర్ 2వరకు స్వస్థ్ నారీ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా 30 పీహెచ్‌సీలతో పాటు జీజీహెచ్‌లోని ఆరోగ్య మహిళ విభాగంలో మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేయటానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రత్యేక వైద్య నిపుణులను రిమ్స్ నుంచి డిప్యూట్ చేసుకోవటానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

'టిమ్స్' డ్రైవర్ల సమస్య కొలిక్కి

● ఆర్టీసీ ఆర్ఎంతో భద్రాచలం ప్రతినిధుల చర్చలు సఫలం

● మూడు మస్టర్లతో 5 సర్వీసులకు గ్రీన్ సిగ్నల్

భద్రాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాంతో భద్రాచలం ఆర్టీసీ బస్సు డిపో ప్రతినిధులు నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. ఆర్టీసీ ఆర్ఎం సూచన మేరకు భద్రాచలం నుంచి టిమ్స్ డ్రైవర్ల ప్రతినిధులు డిపో వెల్ఫేర్ సభ్యురాలు కవితతో కలసి సోమవారం ఖమ్మానికి తరలివెళ్లారు. ఖమ్మం ఆర్ఎం కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చలు జరగగా ఇందులో ఆర్ఎంతో పాటు డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య పాల్గొన్నారు. టిమ్స్ డ్రైవర్లు కోరిన 5 సర్వీసులకు మూడు మస్టర్లతో నడిపేందుకు ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరినట్లు టిమ్స్ డ్రైవర్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. భద్రాచలం నుంచి బీహెచ్ఈఎల్, కూకట్‌పల్లి, మంచిర్యాల తదితర సర్వీసులకు ఆర్ఎం సానుకూలత వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా టిమ్స్ డ్రైవర్లు 8 రోజులుగా చేస్తున్న నిరసనతో విధులకు గైర్హాజరైన క్రమంలో వాటిని సెలవు దినాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆర్టీసీ ఆర్ఎంతో జరిగిన చర్చలు సఫలం కావటంతో ఉద్యోగులు హర్షతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ

ఆగ్రహంతో లారీలను నిలిపివేసిన గ్రామస్థులు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిననల్లబల్లి వద్ద సోమవారం రాత్రి ఒక ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీని సంఘటనా స్థలంలో ఆపకుండా వెళ్లడంతో ఆగ్రహించిన చినబండిరేవు, చిననల్లబల్లి గ్రామస్థులు గంటకు పైగా ఇసుక లారీలను నిలిపివేయడంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్తంభించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. భద్రాచలంలో నివాసం ఉంటున్న చినబండిరేవుకు చెందిన గాలి అచ్యుత్, స్వరూప దంపతులు ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి భద్రాచలానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో చర్ల వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో స్వరూపకు తీవ్రంగానూ, అచ్యుత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

భూ రక్షణ కవచం.. ఓజోన్

పర్యావరణ మార్పులతో పొరకు తూట్లు
మరింత ప్రమాదాన్ని తెస్తున్న కాలుష్యం
మానవ తప్పిదాలతో
ముప్పు ముంచుకొచ్చే అవకాశం
పరిరక్షణపై ప్రజల్లో కొరవడుతున్న అవగాహన

నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం



పాల్వంచ కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్, (ఇన్‌సెట్‌లో) ఓజోన్ పొర చిత్రం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): భూమికి రక్షణ కవచమైన ఓజోన్ పొరను పరిరక్షించుకోవడంలో సర్వత్రా నిర్లిప్తత కనిపిస్తోంది. సాధారణంగా ప్రాముఖ్యత కలిగిన రోజులపై సభలు, సమావేశాలు, వ్యాసరచన, చిత్ర లేఖనం లాంటి పోటీలు నిర్వహించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తుంటారు. కానీ జీవకోటిని అధిక ఉష్ణోగ్రతలతో పాటు పలు ప్రకృతి విపరీత పరిణామాల నుంచి కాపాడే ఓజోన్ పొరను పరిరక్షించుకునే విషయంపై ఎవరికీ అవగాహన కల్పించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతీ ఏడాది సెప్టెంబర్ 16న ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకోవాలన్న విషయాన్ని కూడా మరిచిపోతున్నారు. అసలు ఓజోన్ పొర అంటే ఏంటి? దాని ప్రాముఖ్యం ఏంటీ? అది క్షీణిస్తే ఎదురయ్యే దుష్పరిణామాలేంటి? అనేవాటిపై విస్తృతస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది.

ఓజోన్ గురించి..

భూమి నుంచి 20-50 కిలోమీటర్లు ఎత్తులో ఉన్న స్ట్రాటో స్పియర్‌లో ఆక్సిజన్ అణువులు సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాల ప్రభావం వల్ల ఓజోన్ ఏర్పడుతుంది. ఓజోన్ అనేది మూడు పరమాణువులు కలిగిన ఆక్సిజన్. దీనిని ఓజోన్ (ఓ3) అని పిలుస్తారు. ఈ విషవాయువు లేత నీలి రంగులో ఉంటుంది. ట్రాపో స్పియర్‌లో జీవులకు విషవాయువు అయిన ఓజోన్ స్ట్రాటో స్పియర్ భూమిపై 20-25 కిలో మీటర్ల ఎత్తులో వ్యాపించి , అంతరిక్షం నుంచి హాని కలిగించే కిరణాలను అడ్డుకుని భూ మండలాన్ని జీవకోటిని రక్షిస్తుంది.

పొర క్షీణిస్తే.. దుష్పరిణామాలు..

ఆధునిక, సాంకేతిక యుగంలో పెను మార్పులు

వివిధ దుష్పరిణామాల వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. మానవుని వికృతి శ్రేష్టల వల్ల తన గోతిని తానే తవ్వుకున్నాడు. భూమికి రక్షణ కవచంగా ఉండే జీవ కోటి మనుగడకు సహకరించే ఓజోన్ పొర రోజు రోజుకు తగ్గి పోవడం, రంధ్రాలు ఏర్పడడానికి మానవుని వికృతి శ్రేష్టలే నని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం ఉమ్మడి జిల్లాలో వెలసిన కర్మాగారాలు, గనులు, సిమెంట్ నిర్మాణాలు, చెట్లు నరకడం లాంటి కార్యకలాపాలతో పాటు ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఉద్గారాలు వెలువడే వస్తువులు, యంత్రాల వాడకంతో వాతావరణ కాలుష్యంపెరుగతోంది. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణంలో కొత్తగూడెం ప్రాంతం ప్రథమ స్థానంలో ఉండేది. ప్రస్తుతం దీని స్థానం 5కు పడిపోయింది. వాహనాల సంఖ్య లక్షల్లో పెరిగిపోయింది. వాహనాల నుంచి విడుదల అయ్యే నైట్రోజన్ ఆక్సైడ్, పరిశ్రమల నుంచి వ్యర్థ, దుమ్ము, ధూళి, నైట్రోజన్ ఆక్సైడ్స్ వాయువులు ఓజోన్ పొర క్షిణితకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా క్లోరోఫ్లోరో కార్బన్‌లు (సి.ఎఫ్.సి) అనే వాయువు రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషన్లు, ఫోమ్ బ్లోయింగ్‌లోను, ఏరోసా వాడుతారు. ఈ క్లోరోఫ్లోరో కార్బన్ ప్రభావం ఓజోన్‌పై తీవ్రంగా ఉంటుంది. ఓజోన్ పొర క్షిణిస్తే జీవకోటి అంతరించి పోయే ప్రమాదం ఉంది.

దుష్పరిణామాలు..

- ఓజోన్ పొరలో రంధ్రం ఏర్పడితే ఉష్ణోగ్రత, సముద్రపు మట్టం పెరుగుతాయి. చిన్న చిన్న ద్వీపాలు కనుమరుగవుతాయి. ఎప్పుడు ఎండ వస్తుందో.. ఎప్పుడు వానలొస్తాయో గుర్తించలేము.
- చర్మ వ్యాధులు, కొన్ని జీవరాసులు అంతరించి పోతాయి.
- వాతావరణంలో భారీ మార్పులు - జీవకోటిపై ప్రభావం. దీంతో జబ్బులకు దారి తీస్తుంది.

పరిరక్షించుకోవచ్చు ఇలా..

- ఓజోన్ పొరకు హాని కలిగించే సీఎఫ్‌సీలను నిషేధించాలి. దీనికి ప్రత్యామ్నాయంగా హైడ్రో ఫ్లోరో కార్బన్స్‌ను వినియోగించాలి.
- రిఫ్రిజిరేటర్లలో సీఎఫ్‌సీకి బదులుగా అమోనియాను వాడాలి.
- ఎయిర్ కండీషనర్‌లలో సీఎఫ్‌సీ-12 బదులుగా ఆర్-134 రిట్రోఫిట్‌ను వాడాలి.
- రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి.
- ఓజోన్ పొరపై ప్రజల్లో అవగాహన పెంచాలి.
- వాహనాల నుంచి నైట్రోజన్ ఆక్సైడ్ విడుదలను తగ్గించాలి.
- కర్మాగారాల్లో ఈ ఎస్‌పీఎస్ లాంటి యంత్రాలను వినియోగించాలి.

కాలుష్య నియంత్రణ మండలి భద్రాద్రి జిల్లా అధికారి ఏమన్నారంటే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గాలినాణ్యత సాధారణంగానే ఉంటుందని, 8నెలలుగా కొత్తగూడెంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించగా ఇది వెల్లడైందని పర్యావరణ పరిరక్షణ మండలి ఈఈ బి.రవీందర్ చెబుతున్నారు. ప్యారామీటర్ పీఎం 10ప్రకారం 100 స్టాండ్స్‌కు 70 మాత్రమే ఉందని, అదేవిధంగా వివిధ ప్యారామీటర్లలోని ఫలితాలు సాధారణం కంటే తక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలో పర్యావరణ కాలుష్యం అంతగా లేదని వివరించారు.

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు



ఓపీ..1835

- సోమవారం ఖమ్మంజిల్లా ఆస్పత్రికి వచ్చిన రోగుల సంఖ్య
- వారం రోజులుగా ఇదే పరిస్థితి..
- ఇక్కడికి వస్తున్న వారిలో జ్వరబాధితులే అధికం
- వివిధ విభాగాల వద్ద బారులుతీరుతున్న వైనం
- ప్రైవేట్ హాస్పిటళ్లలోనూ క్యూ కడుతున్న జనం

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దగ్గు.. జలుబు.. జ్వరం.. ఒళ్లు నొప్పులతో జనం మంచం పడుతున్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటంతో జిల్లా ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలు బారులు తీరుతున్నారు. వర్షాలకు వాతావరణం పూరిగా మారిపోవడం, రోడ్లు, పరిసరాలు చిత్తడిగా మారడం, ఖాళీ ప్రదేశాల్లో నీటి నిలవడం.. ఫలితంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో జనం జ్వరాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం ఒక్క రోజే ఓపీ సంఖ్య 1,835 నమోదవగా.. వారం రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సాధారణంగా జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం 1500 మంది వరకు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న రోగులు వస్తుంటారు. కానీ వారం రోజులుగా ఆ సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే 171 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారని, వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్లు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో వారం రోజులుగా నమోదైన ఓపీ వివరాలు..

తేదీ	ఓపీ సంఖ్య	అత్యవసర కేసులు	ఐపీ సంఖ్య
8-09	1885	288	142
9-09	1691	258	145
10-09	1770	247	122
11-09	1468	249	120
12-09	1577	207	112
13-09	1284	243	83
14-09	9	326	41
15-09	1835	124	101

కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరాకు సమీపంలోని సాయిబాబా మందిరం వద్ద జాతీయ రహదారిపై ఒక కారు ఢీకొని ద్విచక్రవాహన చోదకుడికి తీవ్రగాయాలయ్యాయి. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. అతను ద్విచక్రవాహనంపై తల్లాడవైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో కాలు నుజ్జునుజ్జు అయింది. వైరా సీఐ ఎన్.సాగర్, ట్రెయినీ ఎస్ఐ వి. పవన్ ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108లో ఖమ్మం తరలించారు.

ఢిల్లీ ప్రదర్శనలో దుమ్ముగూడెం ఉపాధ్యాయుడు



వేషధారణలో తెలంగాణ ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీ సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన విభాగంలో మండల ప్రభుత్వ ఉపాధ్యాయుడు మళ్లా మోహన్‌కుమార్ హనుమాన్ వేషధారణలో వీక్షకులను అలరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి శిక్షణకు ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయల్లో భాగమైన పోతు రాజు, కొమరం భీం, రుద్రమదేవీల వేషధారణ, బోనాల పండుగ, బతుకమ్మ పండుగలతో పాటు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంకు సంబంధించిన పోకల దమ్మక్క, రామదాసుల చరిత్రను ప్రదర్శించారు. ఇందులో భాగంగా మండలంలోని పెదపాడు టీచర్ మళ్లా మోహన్‌కుమార్ హనుమాన్ వేషధారణతో చూపరులను అబ్బురపరిచారు. సీసీఆర్‌టీ న్యూఢిల్లీలో ఈనెల 10 నుంచి 24 వరకు నెప్-2020 శిక్షణకు భద్రాద్రి జిల్లా నుంచి మోహన్ ఒక్కరే ఎంపికయ్యారు. శిక్షణలో భాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల విభాగంలో పలు రకాల ప్రదర్శనలు నిర్వహించారు.

పీజీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు



డి.నాగ చైతన్య శబరి-1వ ర్యాంకు



హలావత్ చిన్నారి 2వ ర్యాంకు



బండ అఖిల్ 8వ ర్యాంకు

అశ్వారావుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల 2021 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఈ ఏడాది జూలైలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) నిర్వహించిన అఖిల భారత ప్రవేశ పరీక్ష (ఏఐఈఈఈ) (పీజీ)-2025 పలు విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ పరీక్షలో కళాశాలకు చెందిన దనసరి నాగచైతన్య శబరి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు (అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం), బండ అఖిల్ 8వ ర్యాంకు (కీటక శాస్త్రం), హలావత్ చిన్నారి రెండవ ర్యాంకు (సేద్య విభాగం), తిప్పానాగ వినయ్‌కుమార్ 73వ ర్యాంకు, రామవత్ కళ్యాణి 6వ ర్యాంకు, షేక్ నసీనా 24వ ర్యాంకు, దేవరశెట్టి యమున 49వ ర్యాంకు, మద్దెల యామిని 33వ ర్యాంకు సాధించారు. కళాశాలలోని ఐసీఏఆర్- జేఆర్ఎఫ్ శిక్షణ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అతిధి ప్రసంగాలు, పూర్వ విద్యార్థులతో చర్చాగోష్టి ఈ పరీక్షల్లో ఎంతో దోహదపడిందని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నతస్థాయి పరీక్షలు, ఇతర ప్రభుత్వ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చిత్తశుద్ధితో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని అన్నారు.

దమ్మపేటకు.. దొంగ కోళ్ల పంచాయితీ

చోరీ జరిగిన పందెం కోళ్ల విలువ రూ.4లక్షలు
విచారణకు వచ్చిన ఏపీలోని చింతలపూడి పోలీసులు
దౌర్జన్యం చేశారంటూ ఏపీ పోలీసులను స్టేషన్‌లో అప్పగించిన గ్రామస్థులు

దమ్మపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఏలూరు జిల్లా చింతపూడి మండలం పట్టాయిగూడెంలో గ్రామంలో జరిగిన పందెం కోళ్ల ఆచూకీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో లభ్యమైంది. దీంతో చింతలపూడి పోలీసులు దమ్మపేట పోలీసులకు సమాచారం ఇవ్వకుండా విచారణకు రావడం, తమపై దౌర్జన్యం చేశారంటూ దమ్మపేట వాసులు వారిని స్థానిక పోలీసులకు అప్పగించడం వివాదాస్పదమైంది. ఈఘటనకు సంబంధించిన వివరాలివీ.. పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే రైతుకు చెందిన సుమారు రూ.4లక్షలు విలువ ఉండే నాలుగు పందెం కోళ్లు 10రోజుల క్రితం చోరీకి గురయ్యాయి. దీనిపై సదరు రైతు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తన పందెం కోళ్లు భద్రాద్రి జిల్లా దమ్మపేటలో ఉన్నట్లు సదరు రైతుకు సమాచారం అందటంతో.. చింతలపూడికి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, మరో హోం గార్డుతో కలిసి కోళ్ల ఆచూకీ కోసం సోమవారం ఉదయం దమ్మపేటకు చేరుకున్నారు. వీరితో పాటు నాలుగు కార్లలో మరికొంతమంది కూడా రావడంతో గ్రామంలో ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. అప్పటికే దమ్మపేటకు చెందిన పిల్లి వెంకటేశ్వర్లు తమ కోళ్లను దొంగతనం చేశాడని, వాటిని దమ్మపేటకు చెందిన గోపవరపు శేషగిరి అనేవ్యక్తికి విక్రయించాడని, అతడు వాటిని ఓ వ్యక్తి ఇంటి వద్ద ఉంచారని తెలుసుకున్నారు. తొలుత నేరుగా శేషగిరి తాను కొన్న కోళ్లను దాచిన వ్యక్తి ఇంటికి వెళ్లి అక్కడ ఉన్న రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని.. వారంతా గోపవరపు శేషగిరి ఇంటికి చేరుకున్నారు. 'దొంగకోళ్లు కొనుగోలు ఎలా చేశారు? నీ భర్త ఎక్కడ?' అంటూ శేషగిరి భార్య రాజేశ్వరిపై ఏపీ పోలీసులతో పాటు అక్కడికి వచ్చిన రంగనాథ్ తరపువారు దురుసుగా మాట్లాడారు. ఇంటి గేట్లు మూసివేసి ఇంట్లోని సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్కును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమె తన భర్త ఇంట్లో లేడని చెప్పినా పట్టించుకోకుండా వారంతా అక్కడ హల్‌చల్ చేయడంతో పాటు రాజేశ్వరి, ఆమె భర్తను దుర్భాషలాడుతూ అక్కడే కట్టేసి ఉన్న శేషగిరికి చెందిన రెండు కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని తమ కారులో వేసుకొన్నారు. శేషగిరి ఇంటి వద్ద గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్, పలువురు గ్రామస్థులతో అక్కడికి చేరుకుని ఏపీ పోలీసులను వెళ్లనీయకుడా వాహనాన్ని అడ్డుకొని దమ్మపేట పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానిక పోలీస్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులకు నచ్చ చెప్పి ఏపీ పోలీసులు, వారి వెంట వచ్చినవారిని దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. ఇదిలాఉంటే తన కోసం ఏపీ పోలీసులు వచ్చారని తెలుసుకున్న నిందితుడు పిల్లి వెంకటేశ్వర్లు శేషగిరికి అమ్మగా తన వద్ద ఉంచుకున్న రెండు కోడి పుంజులను దమ్మపేట పరిధిలోని అప్పారావుపేట గ్రామ సమీపంలోని ఒక చర్చి వద్ద వదిలి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ సోమవారం రాత్రి దమ్మపేట చేరుకుని తమ సిబ్బందిని తీసుకువెళ్లారు. ఈ విషయంపై దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

యూరియా కోసం రైతుల మధ్య ఘర్షణ

తెల్లవారుజాము నుంచే
జూలూరుపాడు సొసైటీ వద్ద బారులు
అధికారులు రాకముందే..
క్యూలైన్‌లో గంటల కొద్దీ పడిగాపులు
టోకెన్లు పొందే క్రమంలో తోపులాట
సొసైటీ సిబ్బందిపై రైతుల ఆగ్రహం



జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద ఓ రైతుపై దాడి చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. సరిపడా ఎరువులు రాకపోవడంతో వాటిని పొందేందుకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడంలేదు. యూరియాను పొందేందుకు రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవటంతో ఓ రైతుపై దాడికి దిగిన సంఘటన జూలూరుపాడు సొసైటీ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. సొసైటీ కార్యలయానికి శని, ఆదివారాలు సెలవు కావడంతో రైతులకు యూరియా పంపిణీచేయలేదు. దీంతో సోమవారం తెల్లవారుజామునే రైతులు అధికసంఖ్యలో సొసైటీ కార్యలయానికి బారులు తీరారు. అధికారులు రాకముందే టోకెన్ల కోసం క్యూలైన్‌లో నిలుచున్నారు. ఈ క్రమంలో మండలంలోని రాజారావుపేటకు చెందిన ఓ రైతు వెనకనుంచి వచ్చి క్యూలైన్‌లో ముందు నిలబడేందుకు ప్రయత్నించాడు. దీంతో జూలూరుపాడుకు చెందిన కొంతమంది రైతులు అతనితో ఘర్షణకు దిగి దాడి చేశారు. ఈ క్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. అలాగే సొసైటీ సిబ్బంది టోకెన్లను పంపిణీచేసే సమయంలో రైతుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. రైతులు యూరియాను పొందేందుకు ఉదయం 5గంటలకే వచ్చినప్పటికీ సిబ్బంది మాత్రం మధ్యాహ్నం 12 గంటల తర్వాత యూరియా పంపిణీచేశారు. కేవలం 220బస్తాల యూరియా మాత్రమే రావడంతో జూలూరుపాడులోని సొసైటీ కార్యలయంలో 110 బస్తాలను, పడమట నర్సాపురంలోని రైతువేదికలో మరో 110బస్తాలను రైతులకు సిబ్బంది పంపిణీ చేశారు. వ్యవసాయ పనులు మానుకుని యూరియా కోసం రోజూ సొసైటీ కార్యలయానికి రావాల్సి వస్తుందని, తమ కష్టాలు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదంటూ రైతులు వాపోయారు.

మహిళా రైతులు సైతం..



సొసైటీ కార్యాలయం వద్ద వేసి ఉన్న మహిళలు

చండ్రుగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతలేదని అధికారులు ప్రకటనలు చేస్తున్నా, యూరియా కోసం రైతుల పాట్లు అన్నీ ఇన్నీకావు. ఈ క్రమంలోనే సోమవారం గానుగపాడు సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం మహిళా రైతులు సైతం బారులు తీరారు. భూమి పత్రాలు తీసుకొని ఉదయం వచ్చి ఎండ, వానతో ఇబ్బందులు పడుతూ గంటల తరబడి నిరీక్షిస్తే సాయంత్రానికి ఒక యూరియా బస్తా మాత్రమే అధికారులు ఇచ్చారు. దీంతో పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రెండు బస్తాలు అందే విధంగా చూడాలని కోరుతున్నారు.

ముట్టడిలో మేము కూడా..



ముట్టడిలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

దుమ్ముగూడెం సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పీఏసీఎస్ స్టాక్ పాయింట్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ధర్నా, ముట్టడిలు నిర్వహించారు. టోకెన్ పద్ధతి లేకుండా ప్రతీఒక్క రైతుకు రెండు యూరియా కట్టలు ఇవ్వాలని నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎంపీపీ రేసు లక్ష్మీ, పీఏసీఎస్ డైరక్టర్ కాల్వ పూర్ణయ్య, వెంకటేష్, మల్లేశ్వరావు, కామేష్, దామెర్ల శ్రీనివాసు, పృధ్వీ, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పాలనాధికారులు అంకితభావంతో పనిచేయాలి

పోస్టింగ్ ఆర్డర్లు అందజేసిన ఖమ్మం కలెక్టర్ అనుదీప్



పోస్టింగ్ ఉత్తర్వులు అందిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. నూతనంగా నియమించిన గ్రామ పరిపాలన అధికారులకు సోమవారం పోస్టింగ్ ఆర్డర్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామ పరిపాలనా అధికారులను నియమించిం దన్నారు. జిల్లాలో 299 క్లస్టర్లకు 252మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి సొంత మండలం మినహాయించి, ఇతర ప్రదేశాల్లో గ్రామ పరిపాలన అధికారులుగా పోస్టింగు కల్పించినట్లు తెలిపారు. జీపీవోలు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం భూభారతిని పటిష్టంగా అమలు చేసేందుకు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజల భూ సమస్యల పరిష్కారం కోసం నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, నూతన గ్రామ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

ఆ సొసైటీల పదవీకాలాన్ని పొడిగించాలి



జిల్లా సహకార అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాల్లో సొసైటీల పాలకవర్గాలను పొడింగించినట్లు గానే ఖమ్మం జిల్లాలోని పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని ప్రాథమిక సకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలాన్ని పెంచాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా సహకార అధికారి గంగాధర్‌ను కలిసి సొసైటీల పాలకవర్గాల పొడిగింపుపై విన్నవించారు. గతంలో బీఆర్ ఎస్, టీడీపీ పార్టీలు ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పుడు సొసైటీల కాలపరిమితిని పెంచారని గుర్తుచేశారు. ఈమేరకు అధికారుల తీరు మారకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, భాషబోయిన వీరన్న, కనగాల వెంకట్రావు, వీరమోహన్‌రెడ్డి, పాలెపు రామారావు, పలు సొసైటీల ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

పాల్వంచ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ పట్టణ పరిధిలోని అయ్యప్పస్వామి గుడి ప్రాంతంలోని ఓబైక్ షోరూంలో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. పై అంతస్థులోని హాస్టల్ విద్యార్థులు, షోరూం పక్కనే ఉన్న స్కూల్ విద్యార్థులు వెంటనే గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పెద్దగా కేకలు వేస్తూ అందరినీ అప్రమత్తం చేశారు. అనంతరం పైన అమర్చిన అగ్నిప్రమాద నివారణ యంత్రాలను ఘటనా స్థలానికి తీసుకుని వచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. భారీ ఆస్థినష్టం జరుగకుండా కృషిచేసిన విద్యార్థులను స్థానికులు, షోరూం యాజమాన్యం అభినందించారు. సుమారు రూ.20 లక్షల ఆస్థినష్టం జరిగిందని షోరూం నిర్వాహకులు తెలిపారు.

ఎక్స్‌రే ల్యాబ్ టెక్నీషియన్‌పై కేసు

ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

భద్రాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని పిల్లల పార్కు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ వైద్యశాలలో ఆదివారం వైద్యం కోసం ఒడిశా నుంచి వచ్చిన ఓ మహిళపై ఎక్స్‌రే ల్యాబ్ టెక్నీషియన్ జి.శివశంకర్ అనే వ్యక్తి మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఇది. ఓపీ చూస్తున్న సమయంలో వైద్యశాల వైద్యుడు ఎక్స్‌రే పరీక్ష రాయగా ఆమె ఆస్పత్రి ఆవరణలోనే ఉన్న ఎక్స్‌రే యూనిట్‌కు వెళ్లి టెక్నీషియన్‌ను సంప్రదించింది. ఈ సమయంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఈ విషయం ఆస్పత్రి నిర్వాహకులకు చెప్పగా వారు పట్టించుకోలేదని సమాచారం. దీంతో ఆమె నేరుగా భద్రాచలం సీఐ నాగరాజుకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి కేసు నమోదు చేయడంతో పాటు సదరు టెక్నీషియన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

మహిళ మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు

పర్యవేక్షిస్తున్న అధికారులు

అశ్వారావుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శనివారం కావడిగుండ్ల సమీపంలో వాగులో గల్లంతైన మహిళల్లో ఒకరి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మరో మహిళ మృతదేహం ఇంతవరకు లభ్యం కాలేదు. దీంతో అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐ యయాతిరాజు ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక బృందాలు బోట్లు వేసుకొని, స్థానికుల సహకారంతో పరిసరాల్లో సోమవారం మూడోరోజు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. తహసీల్దారు రామకృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేసారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం పెనుబల్లిలో జరిగింది. మండలంలోని సూరయ్యబంజర్ గ్రామానికి చెందిన వడ్డిగ వెంకటకృష్ణయ్య ద్విచక్రవాహనంపై రెవెన్యూ కార్యాలయంలో ఆధార్‌కార్డు మార్పుల కోసం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో పెనుబల్లి మసీదు వద్ద కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణయ్య కాలుకు తీవ్రగాయాలయ్యాయి. అతడ్ని స్థానికులు పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాకరవాయిలో తాగునీటి సమస్యపై ఆందోళన

తిరుమలాయపాలెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాయిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండలంలోని సుబ్లేడు వద్ద మిషన్‌భగీరథ పైపులైన్ పగిలి నాలుగురోజులు అవుతుంది. దీంతో కాకరవాయి గ్రామానికి మిషన్‌భగీరథ మంచినీరు సరఫరా కావడం లేదు. దీంతో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మిషన్‌భగీరథ పైపులైన్లకు మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తామని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొత్తపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

సమీక్షించిన అదనపు కలెక్టర్ శ్రీజ



ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు బావుండాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. సెప్టెంబరు 22 నుంచి 28వరకు నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో 287 ఓపెన్ ఎస్సెస్సీ పరీక్షలు, 254 మంది అభ్యర్థులకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడిచేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి, డీఐవో కె.రవిబాబు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి మంగపతిరావు, పోలీస్, మునిసిపల్, పోస్టల్ విద్యుత్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం: బీజేపీ

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. మోదీ జన్మదినాన్ని గుర్తించేందుకు దేశవ్యాప్తంగా సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయని, దీనిలో భాగంగా ఖమ్మంలో రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేయోభిలాషులు, యువత, కార్యకర్తలతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో ప్రజలందరు ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసిన నర్రా

సంస్మరణ సభలో పోతినేని



ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): సీపీఎం సిద్ధాంతాల కోసం నర్రా రమేశ్ పనిచేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. సోమవారం ఖమ్మం మంచికంటి భవన్‌లో ఇటీవల కన్నుమూసిన నర్రా రమేశ్ సంస్మరణ సభను నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎం సుబ్బారావు, బండి రమేశ్, బండి పద్మ, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, ఎంఏ జబ్బార్ తదితరులు నివాళులు అర్పించారు.

జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 4625 కేసుల పరిష్కారం: సీపీ

ఖమ్మంక్రైం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ద్వారా 4625 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్‌క్రైం కేసుల్లో 52లక్షలకుపైగా రీఫండ్ మొత్తాన్ని బాధితులకు అందించామని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గం రాజమార్గమని అవగాహన కలిపించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు. లోక్‌అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డులు ఎత్తుకెళ్లిన పంచాయతీ కార్యదర్శి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడుతండా పంచాయతీ రికార్డులను ఆదివారంరాత్రి గతంలో పనిచేసిన పంచాతీ కార్యదర్శి గంజి విద్యాసాగర్ ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న తండావాసులు అతడి వద్ద నుంచి రికార్డులను తీసుకున్నారు. విద్యాసాగర్‌పై అనేక ఆరోపణలు రావడంతో ఇటీవల అధికారులు బదిలీ చేశారు. అయితే తన అక్రమాలు బయటపడతాయని నెపంతో రికార్డులను తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో గ్రామస్తులు అతన్ని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకుని భద్రపరిచారు.

అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులపై ఖమ్మం జర్నలిస్టులు గళమెత్తారు. ఎలక్ట్రానిక్ ఛానెల్ జిల్లా బ్యూరోపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలంటూ సోమవారం నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జడ్పీసెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు. టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈఆందోళనకు ఐజేయు నేతలు సంఘీభావం ప్రకటించారు. ఈకార్యక్రమంలో టీయూడబ్ల్యూజే టీజేఎఫ్‌జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్యప్రశాంత్‌రెడ్డి, శెట్టి రజనీకాంత్, జిల్లానాయకులుపాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏఈవో

కామేపల్లి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పరిహారాలు అందాలంటే పంట నమోదు తప్పనిసరి అని కామేపల్లి క్లస్టర్ ఏఈఓ శ్రీకన్య అన్నారు. సోమవారం కామేపల్లి రెవెన్యూలో తాళ్లగూడెం, టేకులతండ గ్రామాల్లో నమోదు కార్యక్రమం చేపట్టారు. రైతులు ఆధార్‌నెంబర్, ఫోన్‌నెంబర్, పొలం సర్వేనెంబర్, పండిస్తున్న పంటల వివరాలు అందించాలన్నారు.

పీఎస్సార్ ట్రస్టు ద్వారా పలు సేవలు

నేలకొండపల్లి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎస్సార్ ట్రస్టు ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. పీఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 1నుంచి 7వరకు చదువుకుంటున్న విద్యార్థులకు షూస్‌తో పాటు రెండు జతల సాక్సులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సోమవారం సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్, సాక్సులను దయాకర్‌రెడ్డి అందించారు. అంతకుముందు నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలిన చలపతిరావు, హెచ్‌ఎం మోతీలాల్, నాయకులు కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, నంబూరి రామారావు, కొర్లకుంట నాగేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు ఫణికుమారి, సుజాత, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. అమ్మగూడెం, కోరట్లగూడెం పాఠశాలలో హెచ్‌ఎంలు షూస్, సాక్సులు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న దయాకరరెడ్డి

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



కర్నాటి స్థూపం వద్ద మాట్లాడుతున్న బాగం హేమంతరావు

నేలకొండపల్లి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి):తెలంగాణా సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో బాగం హేమంతరావు పాల్గొన్నారు. తొలుత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్నాటి కృష్ణయ్య స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం హేమంతరావు మాట్లాడుతూ నైజాం నవాబు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ, నిజాం తాబేదార్ సైన్యం రజాకార్లకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన ఘనత కమ్యూనిస్టులదన్నారు. సాయుధ పోరాటంలో కామ్రేడ్ కర్నాటి కృష్ణయ్యను పట్టిస్తే రూ.పదివేలిస్తామని నాటి నిజాం ప్రభుత్వం ప్రకటించిన సంగతిని హేమంతరావు గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, రైతుసంఘం మండల కార్యదర్శి పాల్తియా శ్రీనివాసరావు, నాయకులు చావా గణపతిరావు, కాశిబోయిన అయోధ్య, వల్లాల కృష్ణ, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని పాలేరు డివిజన్ సీపీఎం కార్యదర్శి బండి రమేష్ అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ సెప్టెంబరు 17న ఖమ్మంలో ని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భాక్యా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సుధర్శన్ రెడ్డి, జిల్లా నాయకులు నంద్రా ప్రసాద్, నందిగామ కృష్ణ, నాగేశ్వరరావు, జక్కపూడి కృష్ణ, మోహన్‌రావు, గురవయ్య, పి.సంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో హాస్టల్ వర్కర్లు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ గిరిజన వసతి సంక్షేమ వసతిగృహాల్లో పనిచేస్తున్న వర్కర్లు రెండు రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు. తిరుమలాయపాలెంలోని ఎస్టీ బాలుర,బాలికల,ఆశ్రమపాఠశాల ఉన్నాయి. ఆయా వసతిగృహాల్లో పనిచేస్తున్న వర్కర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో ఆయా వసతిగృహాల సంక్షేమాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

ఎస్‌ఎఫ్‌ఐ సభలను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఈనెల18,19 తేదీల్లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో డివిజన్ మాజీ కార్యదర్శి కొమ్ము శ్రీను, శీలం ఉమేష్, హరీష్, విష్ణు, అనిల్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పించిన ఇంజనీరింగ్ అధికారులు

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో భావితరాలకు ఏళ్లతరబడి మన్నేలా కట్టడాలను నిర్మించాలని జిల్లా జనవనరుల శాఖ ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు కోరారు. భవిష్యత్ తరాలకు గుర్తుండి పోయేలా నిర్మాణాలను చేపట్టి తన ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను జలవనరులశాఖ కార్యాలయంలో నిర్వహించారు. నీతి నిజాయితీతో పనిచేసి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారతరత్నను అందించిందని ఇది జాతి గర్వించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పంచాయతీ రాజ్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకూబ్, రిటైర్డ్ ఎస్‌ఈ శ్యాంప్రసాద్, స్వర్గం నర్సింహరావు, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నేషనల్ సైన్స్ రాష్ట్రస్థాయి సెమినార్‌కు త్రివేణి విద్యార్థి

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు వారు నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో త్రివేణి విద్యార్థి కే.వనిషారెడ్డి జిల్లా స్థాయిలో మొదటిస్థానం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సి)జిల్లా కోఆర్డినేటర్ ఈ. వెంకటేశ్వర్లు తెలిపారు.ఖమ్మంలోని సైన్స్ మ్యూజియంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో త్రివేణి పాఠశాల 9వతరగతి విద్యార్థిని వనిషారెడ్డి ప్రథమ స్థానం, హార్వెస్ట్ పాఠశాలలో 9వతరగతి విద్యార్థి కొల్లు.ఆశ్రిత్‌రామ్ చౌదరి ద్వితీయ స్థానం, ప్రభుత్వ పాఠశాల రిక్కాబజార్‌లో 9వతరగతి విద్యార్థి పి.లేఖ తృతీయస్థానం సాధించారు. విద్యార్థులను ఖమ్మం అర్బన్ మండల విద్యాశాఖ అధికారి శైలజ లక్ష్మీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుంది.



ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

ఖమ్మంరూరల్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిదిలోని కొండాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి కోటయ్య ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పుడు అటెండెన్స్‌తో విధులకు హాజరుకాకుండా ఉన్నతాధికారులను బురిడి కొట్టించాడు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో పంచాయతీ కార్యదర్శిపై పలు కథనాలు ప్రచురించటం తెలిసిందే.. దీంతో కొండాపురం కార్యదర్శి కోటయ్యపై సోమవారం కలెక్టర్‌కు కొందరు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ వెంటనే సదరు పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని డీపీఓను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

విధుల్లో చేరిన జీపీవోలు

కామేపల్లి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో పది రెవెన్యూ క్లస్టర్లలో పదిమంది నూతన గ్రామ పాలనాధికారులు విధుల్లో సోమవారం చేరారు. తహసీల్దార్ సుధాకర్‌ను శాలువాతో ఘనంగా సత్కారించారు. రైతులకు, ప్రభుత్వానికి వారధిలాగా పని చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీటీరఫీ, ఆర్‌ఐలు విజయభాస్కర్, విజయ ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచాలి: ఎమ్మార్పీఎస్

నేలకొండపల్లి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అన్ని రకాల పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ధర్నానుద్దేశించి వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా అన్ని రకాల పింఛన్లను తక్షణమే పెంచాలని లేని పక్షంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు కట్టెకోల వెంకటేశ్వరరావు, నాయకులు పొట్టపింజర బాలస్వామి, సురేష్, తోళ్ళ వెంకన్న, శ్రీను, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు అందచేశారు.

దివ్యాంగుల ధర్నా

తిరుమలాయపాలెం: దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద సురేష్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.4వేల నుంచి 6వేలకు పెంచుతామని చెప్పి 22నెలలు గడిచినా అమలుచేయలేదన్నారు. ఈకార్యక్రమలో అజ్మీర భారతి, ఎస్‌డీ సైదాబీ, శైలజ, లక్ష్మీ, బాలయ్య, వంగూరి వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

రైతుశ్రేయస్సే లక్ష్యంగా మార్కెట్ అభివృద్ధి

» మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు



మాట్లాడుతున్న హరినాథబాబు

ఖమ్మంరూరల్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే లక్ష్యంగా మద్దులపల్లి మార్కెట్ అభివృద్ధి జరుగుతుందని మార్కెట్ చైర్మన్ బైరు హరినాథబాబు అన్నారు. మద్దులపల్లి మార్కెట్ యార్డులో సోమవారం చాంబర్‌ఆఫ్ కామర్స్ దిగుమతిశాఖ, కోల్డ్‌స్టోరేజ్, ఎగుమతి శాఖల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయన్నారు. మార్కెట్లో సరుకు కొనుగోలు ప్రారంభించేందుకు మార్కెట్‌కు సంబంధించిన అన్నిశాఖలు సహకరించాలని కోరారు. 15రోజుల్లో మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రధానంగా మార్కెట్లో దిగుమతి దారులకు, వ్యాపారస్తులకు సంబంధించి పాత లైసెన్సులతోనే వ్యాపారాలు చేసుకునేందుకు 3ఏళ్ల పరిమితి కల్పించాలన్నారు. సరుకు నిల్వచేసుకునేందుకు గోదాంలు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలన్నారు. నగదు లావాదేవీలకు సంబంధించి మార్కెట్ పరిధిలోనే బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపారులకు ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. హమాలీలు, దడవాయి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. వారంలో ఒకరోజు మార్కెట్‌లో కొనుగోలు చేసేలా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ తుంబూరి దయకర్‌రెడ్డి మాట్లాడుతూ ఛాంబర్ ఆఫ్ కామర్స్, దిగుమతి శాఖ చెప్పిన విషయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు. రూ.25 కోట్లతో నిర్మించుకున్న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తేవడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీ, కార్యదర్శి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కార్యదర్శి మెంతుల శ్రీశైలం, దిగుమతి శాఖ అధ్యక్షులు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఎగుమతి శాఖ అధ్యక్షుడు మాటేటి నాగేశ్వరరావు, కార్యదర్శి సతీష్, ముత్యం ఉపేందర్ రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

» కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
» ప్రజావాణిలో వినతుల స్వీకరణ


ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం అభివృద్ధితో పాటుగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు పెరుగుతున్నాయని వాటిని కేఎంసీ అధికారులు పరిరక్షించాలని కొందరు ఖమ్మంనగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు విన్నవించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శ్రీశ్రీసర్కిల్ నుంచి రాపర్తిసెంటర్ వరకు ప్రధాన రహదారి వెంట ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతున్నాయని ఫిర్యాదులు చేశారు. 2వడివిజన్‌లో మాస్టర్ ప్లాన్ మేరకు 60అడుగుల రహదారిని నిర్మాణం చేయాలని స్థానికులు కోరారు. ఇంటి నెంబర్లు కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని వినతుల వెల్లువా కనిపించింది. నూతనంగా 34వినతులు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.



ఫిర్యాదులు తెలుసుకుంటున్న కమిషనర్

ఐటీహబ్‌లో ఉద్యోగాలకు పీజీ కళాశాల విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఐటీహబ్‌లో పోస్టులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఇంగ్లిష్ విభాగం నుంచి విద్యార్థిని వల్లూరి సారిక,ఎంకామ్‌నుంచి పంబుల అమూల్య, షేక్ రుక్సానా, బింగి సాయికిరణ్ ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రిన్సిపాల్, ఆయావిభాగాల అధిపతులు పి. గోపి, జీ.రమా,ప్లేస్మెంట్ అధికారిగా వ్యవహరించిన అధ్యాపకురాలు వనం లక్ష్మీ హరిత అభినందించారు.



బీటీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

ఎర్రుపాలెం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల అనుసంధానం కోసం బీటీ రోడ్లనిర్మాణానికి రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుండి నిధులు మంజూరయినట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రూ.60లక్షలతో పెద్దగోపవరం నుంచి బంజరకు, రూ.9కోట్లతో బంజరకు, రూ.6.80కోట్లతో జమలాపురం నుంచి రామాపురం గ్రామాలకు మొత్తం రూ.16.40కోట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంజూరుచేసినట్టు తెలిపారు. బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల మధిర వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్లు పెంచాలని ఆందోళన

» తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు » వినతిప్రతాల అందజేత



వైరాలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగులు

సత్తుపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు సీఎం రేవంత్‌రెడ్డి పెంచలేదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లమండల ముత్తారావు అన్నారు. నేడు జరిగే తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా కార్యక్రమంలో భాగంగా సోమవారం సత్తుపల్లిలో ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్థార్‌కు వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు నూతన పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని, అంగవైకల్యం, నిస్సహాయత, నిరాధారణతో ఇప్పటికే ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఐనంపూడి ప్రభాకర్, వలపర్ల రవికుమార్, తగరం మేరీ, జీ.సుగుణ, నల్లంటి అశోక్, గొళ్లమూడి మారేశ్వరరావు, మేకల రవి, దువ్వూరి రమేష్, కంచర్ల భారతమ్మ, వేముల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను తక్షణమే పెంచాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు యంగల నరేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లానాయకుడు కొండూరి రాజేష్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు దామర్ల వీరయ్య మాదిగ, బోయ సుందర్శనం మాదిగ, భాగం రవిమాదిగ, పిల్లలమర్రి నాగరాజు మాదిగ, మోదుగు నాగరాజు మాదిగ, సురేందర్,కృష్ణ తదితరులున్నారు.

కొణిజర్ల: ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు బెల్లంకొండ రవి మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంను వికలాంగులు, చేయూత పింఛన్‌దారులు ముట్టడించారు. ఈకార్యక్రమలో నాయకులు బానోతు సైదులు, ఎల్లార్పు మురళి, ద్వారపుడి బిక్షం, రవికుమార్, వెంకటేశ్వర్లు, అంజి, ముత్యాలరావు పాల్గొన్నారు.

తల్లాడ: వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల ఆసరా పింఛన్ల పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఆధ్వర్యంలో సోమవారం తల్లాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్‌మాదిగ మాట్లాడారు. బీజేపీ జిల్లానాయకుడు అపతి వెంకటరామారావు, మండల కమిటీ అధ్యక్షుడు చల్లానాగులు, సీపీఎం మండల నాయకుడు గుంటుపల్లి వెంకటయ్య సంఘీభావం తెలిపారు. అనంతరం తహసీల్దార్ వి.సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో గుడిబండ్ల సురేష్ మోదుగు కృష్ణ, ఎక్కిరాల నాగేశ్వరరావు, రావూరి కృష్ణ, అద్దంకి అర్జునరావు, మేడి గురవమ్మ పాల్గొన్నారు.

వైరా: దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలుచేయని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైరా రెవెన్యూ కార్యాలయాన్ని ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు ముట్టడించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఎక్కిరాల సుజాత, అంజలి, ఆదినారాయణ, ఇండ్ల వెంకటి, నల్లగట్ల నాగేశ్వరరావు, కోట కోటేశ్వరరావు, మాగంటి బాబు, కనకరత్నం పాల్గొన్నారు.

ముదిగొండ: తమకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు వినతి పత్రం అందజేశారు. వీరి ఆందోళనకు మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు బంకా మల్లయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుప ఉపేందర్, మండల అధ్యక్షుడు రాంబాబు, దివ్యాంగులు, వృద్ధులు పాల్గొన్నారు.

మధిర రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతులకు పింఛన్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధిరలోని వీహెచ్‌పీఎస్, ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో నాయకులు పార్శపు ఏనుక, కనకపూడి శ్రీనివాస్, రాయబారపు దాసు, కూరపాటి సురేష్, మేకల రాజా, వేల్పుల పవన్‌కల్యాణ్, రాజరత్నం, రామారావు, స్వామి, దోర్నాల సుజాతపాల్గొన్నారు. వీరి ఆందోళనకు బీజేపీ నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, కుంచం కృష్ణారావు, పాపట్ల రమేష్, శివరాజు సుమంత్, మర్సకట్ల స్వర్ణాకర్, పగిడిపల్లి కాశీరావు సంఘీభావం తెలిపారు.



సత్తుపల్లిలో...



ముదిగొండలో...



కొణిజర్లలో...



ఏన్కూర్‌లో...

ఆర్థికసాయం అందజేత

కారేపల్లి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తురక సర్వేశ్వరరావు కుటుంబానికి 2000-2001 పదో తరగతి బ్యాచ్ స్నేహితుడి కుటుంబానికి సోమవారం రూ.14,600 నగదును అందజేశారు. జిల్లా మైనార్టీ సంఘం నాయకులు షేక్ గౌసుద్దీన్ సర్వేశ్వరరావు కుటుంబసభ్యులను కలిసి 50కేజిల బియ్యం, రూ.5,000వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజానాట్యమండలి మహాసభ

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి సత్తుపల్లి డివిజన్ మహాసభను పెనుబల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేముల సదానందం, లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కండే సత్యం, తాండ్ర రాజేశ్వరరావు, గుణగంటి లక్ష్మీనారాయణ, బోగి మోహన్‌రావు, మిట్టపల్లి నాగమణి, ప్రజాసంఘాల నాయకులు గాయం తిరుపతిరావు, చిరంజీవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘననివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని లంకపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు బుచ్చయ్య, గుడిమెట్ల బాబు, గొల్లమండల నర్సమ్మ, సక్కుబాయి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పకీర్‌సాహెబ్, కొర్రయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటోవాలా, సేవ కార్యకర్త అయిన షేక్.లతీఫ్ సోమవారం స్కూల్‌బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. తాను కష్టపడి సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని లతీఫ్ సేవ కార్యక్రమాలకు ఖర్చుచేస్తున్నాడు. దానిలో బాగంగానే విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సావి త్రి, ఉపాధ్యాయులు ఇంద్రాణి, పంచాయతీ కార్యదర్శి నాగశేషురెడ్డి, అంగన్‌వాడీ టీచర్ జి.రాజేశ్వరి, నాయకుడు మోరంపూడి మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించిన తహసీల్దార్

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌లోని సాంఘీక సంక్షేమ వసతి గృహాన్ని తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తి సోమవారం పరిశీలించారు. ఆదివారం హాస్టల్‌లోని విద్యార్థులపై వంట మనిషి దాడిచేసిన ఘటనపై హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు వంటమనిషిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తల్లాడలో జర్నలిస్టుల ధర్నా



వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టులు

తల్లాడ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తల్లాడ మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తల్లాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ వి.సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ, గౌరవాధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, షేక్ ముస్తఫా, మునుకూరి అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోదుగు జయరాజు, ఉపాధ్యక్షుడు షేక్ మెహారాజ్, గురిజాల నారాయణరావు, రుద్రాక్ష నరసింహాచారి, అద్దంకి సురేష్, గొడ్ల శ్రీనివాసరావు, గొల్లమండల నాగబాబు, శీలం కరుణాకరరెడ్డి, మేడి యాకుబ్, అద్దంకిప్రసాద్, గుమ్మా నరేష్, పొన్నం శ్రీనివాసరావు, తోట నవీన్, ఆత్మకూరి శేషగిరిరావు, చలపతిగౌడ్, ఇస్నేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జింకలగూడెం పాఠశాలలో పాము కలకలం

వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జింకలగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఓ పాము కలకలం సృష్టించింది. విద్యార్థులు ఆటవస్తువులను తీసుకుంటుండగా పక్కనే ఒక పాము ప్రత్యక్షమైంది. ఒక్కసారిగా విద్యార్థులు భయభ్రాంతులకు గురై కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. విద్యార్థులు కేకలు విన్న గ్రామస్థులు పాఠశాల వద్దకు వెళ్లి తరగతి గదిలో ఆటవస్తువుల పక్కనే ఉన్న పామును చంపి బయట పడవేశారు. ప్రమాదం తప్పిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు.

రైతాంగ సాయుధ పోరాటం ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న జమ్ముల జితేందర్‌రెడ్డి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. రైతాంగ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ సోమవారం మండలంలోని యాతాలకుంటలో నిర్వహించారు. కార్యక్రమంలో తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, దండు ఆదినారాయణ, పూర్ణచంద్రరావు, తడికమళ్ల యోబు, నిమ్మటూరు రామకృష్ణ, పాలకుర్తి వీరయ్య పాల్గొన్నారు.

పోలంపల్లితండా రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలి

కారేపల్లి సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి తండా రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా డివిజన్ నాయకుడు గుగులోత్ తేజనాయక్ అన్నారు. సోమవారం బురదమయంగా మారిన రోడ్డును పార్టీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో తాటి పాపారావు, భూక్యా నాగరాజు, గణేష్, హరిదాస్, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీలో నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం

● కల్లూరు ఏపీఎం అశోకరాణి



కల్లూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఇందిరా క్రాంతి పథకం ద్వారా ఇకపై మహిళ సంఘాల సభ్యులకు గాను బ్యాంకు లావాదేవీలు నేరుగా జరగకుండా నగదు రహిత లావాదేవీలు జరిపేందుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో జిల్లాలో గల అన్ని మండలాల పరిధిలో నగదు రహిత కార్యక్రమం అమలులోకి వస్తుంది. సోమవారం ఈ నగదు రహిత కార్యక్రమంపై కల్లూరు ఐకేపీ ఏపీఎం ఆశోకరాణి ఆంధ్రజ్యోతితో మాట్లడతూ కల్లూరు మండలంలోని ఐకేపీ ద్వారా ప్రతి ఏడాది సగటున రూ. 59 కోట్లు మహిళ సంఘాల సభ్యులకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ పద్ధతితో మహిళ సంఘాల వారు నేరుగా ఆయా బ్యాంకులకు చుట్టు తిరగాల్సి వచ్చేది. ఇలా సమయం వృథా అవుతుంది. బ్యాంకుకు వెళ్లి నగదు చెల్లించకుండా, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రుణాల రికవరీలు చెల్లించేందుకు కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం కల్లూరు ఐకేపీ కార్యాలయంలో ముందుగా వీవోఏలు, వీవోలకు అవగాన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

మధిర రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం మధిరలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేస్తూ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు శీలం నర్సింహారావు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏ శాస్త్రికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాపినేని రాం నర్సయ్య, చావా పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అండర్‌పాస్ ఎత్తు పెంచే వరకు పనులు నిలిపివేయాలి

మధిర రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగపూర్-అమరావతి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా నిధానపురం గ్రామసమీపంలో అండర్‌పాస్ నిర్మాణం ఎత్తు తక్కువగా ఉందని, ఎత్తు పెంచాలని రైతులు, ప్రజలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న అండర్‌పాస్ ఎత్తు 12నుంచి 15అడుగుల వరకే ఉంటుందని దీన్ని 18నుంచి 20అడుగులు ఎత్తు పెంచాలని రైతులు, ప్రజలు కోరారు. ఎత్తు పెంచేవరకు అండర్‌పాస్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు, భరణిపాడు గ్రామాల్లో నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న వరి పంటను సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సందర్శించి పరిశీలించారు. బీపీటీ2782 రకం వరి విత్తనాలు కల్తీకి గురయ్యాయని, కొన్ని ముందుగానే ఈనడంతో రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీపై చర్యలు తీసుకొని రైతులకు నష్టపరిహారం వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో రామ్మోహన్‌రావు, ఏఈవోలు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

తల్లాడ: తల్లిదండ్రులను మించిన దైవం లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం తల్లాడలోని ఆర్‌బీ గార్డెన్స్‌లో జరిగిన ఇన్‌స్పైయిర్ ఇగ్నైట్ వారి ఆధ్వర్యంలో మోటివేషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పిల్లలందరు తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలు శ్రద్ధగా విని ఆచరించాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు జక్కంపుడి కిషోర్, గుర్రం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈనెల 17న జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. సోమవారం వైరాలో బాజోజు రమణ అధ్యక్షతన జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే సందర్భంలో 17న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో భారీ సభ జరుగుతుందని సీపీఎం ఆలిండియా కార్యదర్శి ఎంఏ.బేబీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొంటారని ఈ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సుంకర సుధాకర్, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పచలక కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, స్వీపర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 16నుంచి 20వతేదీ వరకు దరఖాస్తులను పాఠశాలలో అందించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన జీపీవోలు

వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా మండలానికి తొమ్మిది జీపీవో క్లస్టర్ పోస్టులను మంజూరు చేసింది. తొమ్మిదిమంది జీపీవోలను నియమించింది. మండలంలో 13జీపీవో క్లస్టర్లు ఏర్పాటుచేసి 15మంది జీపీవోలను నియమించాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే మొదట పంపించిన తొమ్మిది జీపీవో క్లస్టర్లు ఏర్పాటుచేసి వాటికి జీపీవోలను ప్రభుత్వం కేటాయించింది. సోమవారం ఏడుగురు జీపీవోలు వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు వద్ద బాధ్యతలు చేపట్టారు. క్లస్టర్ల వివరాలిలా ఉన్నాయి. ఈ తొమ్మిది క్లస్టర్ల పరిధిలో 22రెవెన్యూ గ్రామాలుండగా 33,711ఎకరాల సాగుభూమి ఉంది. ఇంకా సిరిపురం, ఖానాపురం క్లస్టర్ జీపీవోలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

ఎర్రుపాలెం: మండలంలో 24 రెవెన్యూగ్రామాలను 16క్లస్టర్లుగా విభజించారు. రేమిడిచర్ల రెండుక్లస్టర్లు మినహా 14క్లస్టర్లకు 14మంది జీపీవోలకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తహసీల్దార్ మన్నే ఉషాశారద నియామక పత్రాలు అందించారు.

కల్లూరు: కల్లూరు మండల గ్రామ పరిపాలన అధికారులుగా సోమవారం పది మంది జీపీవోలు బాధ్యతలు చేపట్టారు.

కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

● అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని



కాంగ్రెస్‌లో చేరిన వారితో మల్లు నందిని

మధిర, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. సోమవారం మధిర లోని క్యాంపు కార్యాలయంలో మాటూరు గ్రామానికి చెందిన ఎటికల కృష్ణారావు, పుల్లారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన 12 కుటుంబాల వారికి ఆమె పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ నాయకులు నిడమానూరు వంశీ, కర్నాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

పెనుబల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పచలక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోమవారం లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ ఆరోగ్యం పట్ల విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, కవిత, అశోక్, ఆరోగ్య కార్యకర్త కల్పన, పాఠశాల ఎస్‌వో వెంకటరమణ, హస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

వైరాలో విశ్వేశ్వరయ్య జయంతి

వైరా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని జాతీయ ఇంజనీరింగ్ డేగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఒకేషనల్ విభాగం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి, అధ్యాపకులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్ ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేత

● రూ. 53 వేల బిల్లు బకాయి కారణం

బోనకల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు ఇంటికి సోమవారం విజిలెన్స్ అధికారులు సీహెచ్ రమణి, ఏఈ తోకల మనోహర్ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. గత 2022 నుంచి ఇప్పటి వరకు విద్యుత్ బకాయిల కింద రూ.53 వేలు చెల్లించాల్సి ఉందని, గతంలో కేసు కూడా నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పలుమార్లు పెండింగ్ బిల్లు చెల్లించాలని చెప్పినా స్పందించకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు పేర్కొన్నారు.